# దేశ టైమ్స్

DESHA TIMES

TELUGU DAILY

తెలుగు దినపత్రిక

నల్లగొండ సంపుటి:16 సంచిక:84 ఎడిటర్: సయ్యద్ పాష 10-04-2026 శుక్రవారము పేజీలు :8 వెల:1/-



**లంచగొండుల వివరాలు ఏసిబికి తెలపండి**

ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు, లంచగొండితనానికి పాల్పడుతున్నట్లు ఎలాంటి సమాచారమున్నా అవినీతి నిరోధక శాఖకు తెలయజేయ వలసిందిగా ఏసిబి డైరెక్టర్ జనరల్ ప్రజలను కోరారు. సమాచారం అలందించిన వారుపేరు, వివరాలను గోప్యంగా ఉంచుతామని ఒక ప్రకటనలో తెలిపారు.

వివరాలకు:

డైరెక్టర్ జనరల్, అవినీతి నిరోధక శాఖ,
మొజంజాహి మార్కెట్ రోడ్, హైద్రాబాద్ -500 001
ఫోన్: (040) 2475132,


## పాకిస్థాన్ మధ్యవర్తిత్వంపై మాకు నమ్మకం లేదు

న్యూఢిల్లీ:అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణకు సంబంధించిన చర్చల్లో పాకిస్థాన్ పాత్రపై ఇజ్రాయెల్ సందేహం వ్యక్తంచేసింది. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంపై తమకు నమ్మకం లేదని పేర్కొంది. భారత్ లోని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ ఓ వార్తాసంస్థతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్‌ను తాము విశ్వసించలేమని, అమెరికా తన స్వప్రయోజనాల కోసం పాక్ మధ్యవర్తిత్వాన్ని ఉపయోగించుకోవాలని నిర్ణయించుకున్నదని తాము భావిస్తున్నట్లు అజార్ తెలిపారు. ఈ సందర్భంగా ఖతార్, తుర్కియే వంటి సమస్యాత్మక దేశాల ద్వారా హమాస్‌తో అమెరికా కుదుర్చుకున్న ఒప్పందం గురించి అజార్ ప్రస్తావించారు. ఇరాన్‌లో తాము అనుకున్న లక్ష్యాలు సాధించేందుకు యూఎస్ సమన్వయంతో ముందుకుసాగడం తమకు చాలా ముఖ్యమని అన్నారు. ఇక అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణకు మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. అయితే లెబనాన్‌పై మాత్రం తమ సైనిక చర్యలు కొనసాగుతాయని పునరుద్ఘాటించారు. ఇరాన్‌పై జరిపిన ఆపరేషన్‌కు, లెబనాన్‌కు ఎలాంటి సంబంధం లేదని అజార్ అన్నారు. దక్షిణ లెబనాన్ ప్రాంతం నుంచి హెజ్‌బొల్లా మౌలిక సదుపాయాలను పూర్తిగా నిర్మూలించడమే తమ లక్ష్యమని చెప్పారు. అది ఇజ్రాయెల్ బాధ్యతగా అభివర్ణించారు.

## నౌకల్లోనే ఉండండి, బయటికి రావద్దు..



న్యూఢిల్లీ:హర్మూజ్ జలసంధి లో చిక్కుకుపోయిన భారత నావికులకు కేంద్రం అత్యవసర అడ్వయిజరీ జారీచేసింది. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, అనవసరంగా నౌకల నుంచి బయటకు రావద్దని సూచించింది. ఈ మేరకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ ఒక ప్రకటన విడుదలచేసింది. భద్రతాకారణాల దృష్ట్యా ఇరాన్ దాని పరిసర జలాల్లో చిక్కుకుపోయిన భారత నావికులు సున్నితమైన ప్రదేశాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నది. అవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దని సూచించింది. ఎప్పటికప్పుడు భారత రాయబార కార్యాలయంతో టచ్‌లో ఉండాలని కోరింది. నౌకలలో ఉన్న నావికులు వాటిలోనే ఉండాలని పేర్కొన్నది. అప్రమత్తంగా ఉంటూ.. అధికారులు జారీచేసే సూచనలను పాటించాలని కోరింది. కంపెనీ ప్రతినిధులు, అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ ఉండాలని సూచించింది. దాదాపు 40 రోజుల భీకర దాడుల తర్వాత ఇరాన్-అమెరికా మధ్య రెండు రోజుల క్రితం రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. అయినప్పటికీ పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తొలగిపోలేదు. అయితే ఇంతలో లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేయడం మరోసారి ఉద్రిక్తతలకు దారితీసింది. దీనిపై ఆగ్రహం వ్యక్తంచేసిన ఇరాన్ హర్మూజ్‌ను మరోసారి మూసివేసింది. దాంతో పరిస్థితి మళ్లీ ఉద్రిక్తంగా తయారైంది. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలంటూ భారత నావికులకు అడ్వయిజరీ జారీచేసింది.

## తల్లిదండ్రులను వృద్ధాప్యం లో ప్రేమగా చూసుకోవాలి

మహబూబాబాద్, : తల్లిదండ్రులను వృద్ధాప్యంలో ప్రేమగా చూసుకోవడం పిల్లల బాధ్యత అని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. సమాజంలో వృద్ధుల పట్ల గౌరవం, ఆదరణ పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈరోజు(గురువారం) మహబూబాబాద్‌లో మంత్రి సీతక్క పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతక్క మీడియాతో మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, పాలిచ్చే తల్లులకు అందించే పౌష్టికాహార పంపిణీని కచ్చితంగా పర్యవేక్షించేందుకు స్మార్ట్ ఫోన్లు రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేశామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన యాప్ ద్వారా లబ్ధిదారుల వివరాలు, ఆహార పంపిణీ వివరాలు నమోదు చేసి పారదర్శకత పెంచుతామని చెప్పుకొచ్చారు. ఆరేళ్లలోపు పిల్లలు, గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపాన్ని తగ్గించడం తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలి



సూర్యాపేట :సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలు, సూచనలు పాటించాలి. వాహనదారులు ట్రాఫిక్ సిగ్నల్స్ ను అనుసరించాలి అవగాహన కల్పించాలని సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ పోలీసులను ఎస్పి నరసింహ ఐపిఎస్ ఆదేశించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో రోజురోజుకు పెరుగుతున్న వాహనాల రద్దీ దృశ్య పోలీస్ శాఖ ఎప్పటికప్పుడు ట్రాఫిక్ పునరుద్ధరణ, ట్రాఫిక్ నియంత్రణ చేస్తూ ప్రణాళిక ప్రకారం ముందుకు వెళుతుందని అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్నటువంటి ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాట్లకు సంభందించి కొత్త బస్టాండ్ వద్ద సంబంధిత అధికారులతో కలిసి ఎస్పి పరిశీలించారు. బస్టాండ్ ప్రాంగణంలో రహదారులపై ఉన్న ట్రాఫిక్ రద్దీని, రోడ్ల వెంబడి నిర్వహిస్తున్న వ్యాపార సముదాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు సలహాలు అందించారు. ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాట్ల పనులను వేగంగా పూర్తి చేయాలని, మున్సిపల్ శాఖ అధికారులతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించేలా ప్రజలను వాహనదారులను ముందస్తుగా అప్రమత్తం చేయాలని తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణ పునరుద్ధరణకు సంబంధించి అన్ని రకాల చర్యలను తీసుకోవాలని, ఆర్టీసీ అధికారులను సంప్రదించి జిల్లా కేంద్రంలో, కొత్త బస్టాండ్ వద్ద ఆర్టీసీ బస్సుల రాకపోకలు, మార్గాలను సులభతరం, ఖమ్మం క్రాస్ రోడ్డులో ఆక్రమించి రోడ్డుమీదికి పండ్లు, టీ స్టాల్, ఆటోలు, పొట్టి శ్రీరాములు సెంటర్ చౌరస్తా లో రోడ్డు ఆక్రమించి పండ్లు, హోటల్లో, టీ స్టాళ్ళు, మరియు కోర్టు చౌరస్తాలో పండ్లు, ఆటోలు వాహనదారులకు అసౌకర్యం కల్పించవద్దని తెలిపారు. సూర్యాపేట పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి పోలీస్ సిబ్బందిని బలోపేతం చేస్తామని అన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలు రోడ్డు నియమాలు పాటించి రోడ్డు ప్రమాదాలకు గురవకుండా సురక్షితంగా గమ్యం చేరుకోవాలని అన్నారు. వ్యాపారస్తులు రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించకూడదని దీనివల్ల ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం నందు స్థానిక డిఎస్పి ప్రసన్నకుమార్, ఇన్స్పెక్టర్ వెంకటయ్య, ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం ఉన్నారు.

## పల్నాడు ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన పెను ప్రమాదం..



హైదరాబాద్: నల్గొండ జిల్లా తిప్పర్తి మండలం తిప్పమ్మగూడెం సమీపంలో పల్నాడు ఎక్స్‌ప్రెస్ గేదెను ఢీకొనడంతో గురువారం ఉదయం సికింద్రాబాద్-గుంటూరు మార్గంలో రైలు రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని అధికారులు పేర్కొన్నారు. రైల్వే అధికారుల ప్రకారం, ఒక జంతువు రైలు చక్రాల మధ్య చిక్కుకుపోవడంతో రైలు నిలిచిపోవాల్సి వచ్చింది. ఈ ఘటన కారణంగా తిరుపతి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ జన్మభూమి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, ఇంటర్‌సిటీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌తో సహా పలు రైలు సర్వీసుల రాకపోకల్లో జాప్యం ఏర్పడింది. రైల్వే సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని, అడ్డంకిని తొలగించడానికి అవసరమైన చర్యలు ప్రారంభించారు. ఎలాంటి సాంకేతిక సమస్యలు లేవని నిర్ధారించుకోవడానికి క్షుణ్ణమైన భద్రతా తనిఖీ నిర్వహించిన తర్వాతే పల్నాడు ఎక్స్‌ప్రెస్ తన ప్రయాణాన్ని తిరిగి ప్రారంభిస్తుందని అధికారులు తెలిపారు. ఆ మార్గంలో సాధారణ రైలు సేవలను పునరుద్ధరించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని రైల్వే అధికారులు వెల్లడించారు.

## జూన్ 2వ తేదీ నుంచి విద్యార్థులకు అల్పాహార పథకం



ఖమ్మం : కేసీఆర్ హయాంలోని పదేళ్లు వనరులు దోపిడీకి గురికావటం వల్ల తెలంగాణలో అభివృద్ధి జరగలేదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. విద్య ద్వారానే తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. ఈరోజు(గురువారం) ఎర్రుపాలెంలో అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. అక్షరమే ఆయుధంగా ప్రతి విద్యార్థి ఎదగాలని ఆకాంక్షించారు. జూన్ 2వ తేదీ నుంచి విద్యార్థులకు అల్పాహార పథకం అమల్లోకి తీసుకువస్తామని తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తామని వివరించారు. ప్రతి బిడ్డకు ఉచితంగా మెరుగైన విద్య అందిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో 100 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుకు శ్రీకారం చుడతామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మధిర నియోజకవర్గ రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నెస్పీ ఆయకట్టు పరిధిలో చివరి భూములకు సాగునీరు అందించాలన్నదే తన సంకల్పమని తెలిపారు. రూ. 36 కోట్లతో కట్టలేరు కాలువల మరమ్మతులను చేపట్టామని అన్నారు. ఎన్నెస్పీ కెనాల్ మూడవ జోన్ పరిధిలో ఉన్న భూములను రెండవ జోన్ కిందకు తీసుకువచ్చి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందజేస్తున్నామని వివరించారు. బీఆర్ఎస్ హయాంలో సీతారామ ప్రాజెక్ట్‌ను గాలికొదిలేశారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీతారామకు నిధులు కేటాయించి పనులు పూర్తి చేయిస్తున్నామని స్పష్టం చేశారు. వ్యవసాయం, పరిశ్రమలు, విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టామని అన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ తీసుకువస్తున్నామని.. ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం జరుగుతోందన్నారు. మధిర నియోజకవర్గంలో రహదారుల నిర్మాణం జరుగుతోందని చెప్పారు. కట్టలేరు ప్రాజెక్టు పనులను శరవేగంగా పూర్తి చేయాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు.

## బెంగాల్ మార్పు కోరుకుంటోంది..



పశ్చిమబెంగాల్ :పశ్చిమబెంగాల్ లోని హల్దియా లో ప్రధాని నరేంద్రమోదీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తృణమూల్ కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. ఐదేళ్ల క్రితం నందిగ్రామ్ లో సీఎం మమతాబెనర్జి ఓటమిని గుర్తుచేస్తూ.. ఈసారి పశ్చిమబెంగాల్ రాష్ట్రం అంతటా అదే ఫలితం పునరావృతమవుతుందని చెప్పారు. పశ్చిమబెంగాల్ మార్పును కోరుకుంటోందని, ఈ క్రమంలో బీజేపీ భారీ విజయాన్ని చూస్తామని వ్యాఖ్యానించారు. నందిగ్రామ్‌లో ఐదేళ్ల క్రితం ఏం జరిగిందో ఇప్పుడు భవానీపూర్‌తోపాటు మొత్తం బెంగాల్‌లోనూ అదే ఫలితం వస్తుందని ప్రధాని జోష్యం చెప్పారు. ఇవి సాధారణ ఎన్నికలు కావని, ఈ ఎన్నికలు అభివృద్ధికి, బెంగాల్ చరిత్రను తిరగరాయడానికి ఎంతగానో తోడ్పడతాయని అన్నారు. భారత్ ఎంతో వేగంగా అభివృద్ధి చెందినప్పటికీ టీఎంసీ ప్రభుత్వం బెంగాల్ అభివృద్ధికి అడ్డుపడుతోందని విమర్శించారు. ప్రైవేటు సెక్టార్లలో సామాన్యులను ఉద్యోగాల నుంచి తొలగించి చొరబాటుదారులకు అవకాశం కల్పిస్తోందని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి రాగానే రాజ్యాంగం ప్రకారం టీఎంసీ చేసిన మోసాలను బయటకు తీస్తామని, బెంగాల్ యువతకు వ్యతిరేకంగా తృణమూల్ చేసిన పాపాలు వందేళ్లు గడిచినా తొలగిపోవని మోదీ వ్యాఖ్యానించారు. ఒక్కసారి డబుల్-ఇంజిన్ సర్కార్ అధికారంలోకి రాగానే కేంద్ర ప్రభుత్వ పథకాలన్నీ ఇక్కడ అమల్లోకి వస్తాయని చెప్పారు. బెంగాల్ ప్రజలకు ఆరు హామీలు ఇస్తున్నానని అన్నారు. అన్యాయానికి గురైన ఆడబిడ్డల కేసులను తిరగదోడుతామని, అవినీతికి సాయం చేస్తున్న చట్టాలను రూపుమాపుతామని తెలిపారు. తృణమూల్ ప్రభుత్వంలో కుంభకోణాలకు, అవినీతికి పాల్పడిన వారిని జైలుకు పంపిస్తామని ప్రధాని అన్నారు. శరణార్థులకు రాజ్యాంగం ప్రకారం ప్రత్యేక హక్కులను కల్పిస్తామని, చొరబాటుదారులను మాత్రం దేశం నుంచి తరిమికొడతామని చెప్పారు. ఒక్కసారి బీజేపీ అధికారంలోకి రాగానే 7వ వేతన కమిషన్‌ను అమల్లోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు.

## ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం



హైదరాబాద్, : భాగ్యనగరంలోని కీలకమైన షేక్‌పేట్ ఫ్లైఓవర్ నుంచి మాసాబ్ ట్యాంక్ వరకు ట్రాఫిక్ కష్టాలను తీర్చి, ఈ మార్గాన్ని 'మోడల్ కారిడార్'గా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వ యంత్రాంగం కసరత్తు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా గురువారం హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్, ఐపీఎస్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, ఐఏఎస్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. అధికారులందరూ కలిసి ఒకే బస్సులో ప్రయాణిస్తూ.. మార్గమధ్యలో ఉన్న బాటిల్ నెక్‌లు (ట్రాఫిక్ అడ్డంకులు), నీరు నిలిచే ప్రాంతాలు, ఆక్రమణలను స్వయంగా పరిశీలించి తక్షణ పరిష్కార మార్గాలను సూచించారు. ఎస్‌డిఐ హాస్పిటల్ వద్ద, బృందావన్ కాలనీ రోడ్ నంబర్-1 వద్ద కొత్తగా ఫుట్ ఓవర్ బ్రిడ్జిల ను నిర్మించాలని నిర్ణయించారు. షేక్‌పేట్ నాలా వద్ద పెలికాన్ సిగ్నల్, జీబ్రా క్రాసింగ్‌లను ఏర్పాటు చేయనున్నారు. నానల్ నగర్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు వీలుగా అక్కడ ఉన్న రోటరీ వెడల్పును తగ్గించి, రహదారిని విస్తరించాలని అధికారులను ఆదేశించారు. రేతిబౌలి నుంచి నానల్ నగర్ వరకు ఉన్న సెంట్రల్ మీడియన్‌ను, అడ్డంగా ఉన్న చెట్లను తొలగించి రోడ్డును వెడల్పు చేయనున్నారు. ఎన్ఎండీసీ, డెల్ స్టోర్ ప్రాంతాల్లో మాస్టర్ ప్లాన్ ప్రకారం భూసేకరణ చేపట్టి రహదారి విస్తరణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. రహదారి మధ్యలో ఉన్న రామాలయం ఆర్చ్, బొడ్రాయి, అలాగే షేక్‌పేట్ నాలా సమీపంలోని సమాధులను తొలగించి వాహనా ల రాకపోకలకు మార్గం సుగమం చేయాలని కమిషనర్లు ఆదేశించారు. మాసాబ్ ట్యాంక్ ఫ్లైఓవర్ వద్ద ఎత్తు పరిమితి బారియర్లు, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయనున్నారు. మెహదీపట్నం వైపు ఉన్న ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్ ను తరలించి, పోచమ్మ బస్తీ నుంచి రోడ్ నెం. 12కు నేరుగా వెళ్లేలా స్లిప్ రోడ్డును అభివృద్ధి చేయనున్నారు. ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా తక్షణమే చేయదగ్గ పనులు, దీర్ఘకాలిక పనులను గుర్తించామని హైదరాబాద్ సీపీ సజ్జనార్, ఐపీఎస్ పేర్కొన్నారు. నగరంలోని ట్రాఫిక్ పనుల నిమిత్తం ప్రతి జోన్‌కు రూ. 20 కోట్ల చొప్పున మొత్తం రూ. 120 కోట్లు కేటాయిస్తున్నా మని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ వెల్లడించారు. కేబీఆర్ పార్క్ వద్ద పెండింగ్‌లో ఉన్న పనులను రెండేళ్లలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డి.జోయల్ డెవిస్ ఐపీఎస్ (జాయింట్ సీపీ ట్రాఫిక్), జి ముకుంద రెడ్డి ఐఏఎస్ (జోనల్ కమిషనర్), ప్రియాంక ఆలా ఐఏఎస్ (జోనల్ కమిషనర్), కాజల్ ఐపీఎస్ (డీసీపీ ట్రాఫిక్), కె. శ్రీనివాస్ (చీఫ్ సిటీ ప్లానర్), ఎస్.రత్నాకర్ (చీఫ్ ఇంజనీర్), వేణుగోపాల్ రెడ్డి (అడిషనల్ డీసీపీ), డి. ధనలక్ష్మి (ఏసీపీ ట్రాఫిక్ గోల్కొండ) ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నిప్పుల కొలిమిగా తెలంగాణ

హైద్రాబాద్: తెలంగాణలో ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం 8 దాటిందంటే చాలు భానుడి భగభగలు ప్రజల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇక ఉదయం 10 తర్వాత రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. హైదరాబాద్ నగరంతో పాటు చాలా పట్టణాల్లో ఇదే పరిస్థితి. ఇక తీవ్రమైన ఎండలకు తోడు ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఏసీలు, కూలర్లు, ఫ్యాన్ల కింద సేదతీరుతున్నారు. కాగా, రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు మరో 3 డిగ్రీలు పెరుగుతాయని తాజాగా హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. ఇవాళ ఉమ్మడి ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. మిగతా అన్ని జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు. రేపట్నుంచి ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. కాగా, బుధవారం (ఏప్రిల్ 8) రాష్ట్రంలోని 20 జిల్లాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వాతావరణశాఖ తెలిపింది. వచ్చే మూడ్రోజులు ఈ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు పెరుగుతాయని చెప్పింది. గతేడాదితో పోలిస్తే అన్ని జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వెల్లడించింది. బుధవారం ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంలో రాష్ట్రంలోనే అత్యధికంగా 41.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెంలో 41.5 డిగ్రీల సెల్సియస్, నల్లగొండ జిల్లా నేరడుగొమ్మలో 41.5 డిగ్రీల సెల్సియస్, సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులో 41.4 డిగ్రీల సెల్సియస్, జనగామ జిల్లా పాలకుర్తిలో 41.2 డిగ్రీల సెల్సియస్, వరంగల్ జిల్లా సంగెంలో 41.2 డిగ్రీల సెల్సియస్, హైదరాబాద్‌లో 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని తెలిపారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, తీవ్రమైన వడగాల్పుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎండలో శరీరం నుంచి చెమట రూపంలో నీరు, లవణాలు బయటకు పోతాయని.. కాబట్టి దాహం వేయకపోయినా తరచుగా నీరు తాగుతూ ఉండాలని చెబుతున్నారు. మంచినీటితో పాటు కొబ్బరి నీళ్లు, మజ్జిగ, నిమ్మరసం వంటివి తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్స్ అందుతాయని అంటున్నారు. చక్కెర శాతం ఎక్కువగా ఉండే శీతల పానీయాలు, కెఫిన్ అధికంగా ఉండే కాఫీ, టీలకు దూరంగా ఉండటం మంచిదని సూచిస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత అత్యధికంగా ఉంటుందని.. అత్యవసరమైతే తప్ప ఈ సమయంలో బయటకు వెళ్లకపోవడమే మంచిదని అంటున్నారు. బయటకు వెళ్లాల్సి వస్తే వదులుగా ఉండే కాటన్ దుస్తులను ధరించాలని.. తలకు ఎండ తగలకుండా గొడుగు, టోపీ వంటివి ధరించాలి అంటున్నారు. కళ్లకు రక్షణగా సన్ గ్లాసెస్ వాడటం మంచిదని చెబుతున్నారు. వేసవిలో తేలికపాటి ఆహారం తీసుకోవాలని.. వృద్ధులు, చిన్న పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

దేశ టైమ్స్

## సంపాదకీయం

### చిన్ననాటి బడి గురువులు కనపడగానే సహజంగానే మనసు గతం లోతుల్లోకి వెళ్లిపోతుంది...

ప్రతి ఊరికి ఒక గుడి ఉంటుందో లేదో కానీ బడి మాత్రం ఉంటుంది. బడి ప్రాధాన్యత అలాంటిది. ఒకవేళ ప్రభుత్వ పాఠశాల కానీ ప్రైవేటు పాఠశాల కానీ లేకపోయినా కనీసం ఆ ఊర్లో ఎవరో చదువుకున్న వ్యక్తి అయినా నలుగురిని కూర్చోబెట్టుకుని ఏదో నేర్పుతుంటాడు. చదువుకు అనాది నుండి అదే ప్రాముఖ్యత. ఎవరైనా తాము చదివిన బడిని, పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను అంత తొందరగా మరువలేరు. బడి పట్ల అభిమానం, గురువుల పట్ల గౌరవం ఏనాడు తరగవు. బడితో ఉండే అనుబంధం చిరకాలం నిలుస్తుంది. చిన్ననాటి బడి గురువులు కనపడగానే సహజంగానే మనసు గతం లోతుల్లోకి వెళ్లిపోతుంది. మన తెలంగాణ విద్యా కమిషన్ ఊళ్ళలోని పాఠశాలలను విలీనం చేసి ప్రతి మండలంలో విద్యార్థుల సంఖ్యను బట్టి మూడు లేదా నాలుగు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేయమని సిఫార్సు చేయగా రాష్ట్ర ప్రభుత్వం అందుకు అంగీకరించి నిధులు కేటాయించి రంగంలోనికి దిగుతున్నది. మనం చిన్నతనంలో చదువుకున్న ప్రాథమిక, ప్రాథమిక ఉన్నత, సెకండరీ పాఠశాలలన్నీ కలిసిపోయి ఒకే పాఠశాలగా ఇంటర్మీడియట్‌వరకు నడుస్తాయట.వివిధ యాజమాన్యాలతో నేడు నడుస్తున్న 28 రకాల పాఠశాలలన్నీ మాయమై మూడు లేదా నాలుగు రకాలు మాత్రమే మనకు కనబడతాయి. అంతేకాదు ప్రభుత్వ ఉపాధ్యాయులు కూడా క్రమంగా తగ్గిపోయి కాలక్రమంలో కాంట్రాక్టు టీచర్లే ఈ పబ్లిక్ స్కూల్స్‌లో పాఠాలు చెప్తారు. జూనియర్ కళాశాలలు, ఇంటర్మీడియట్ బోర్డు కూడా రద్దు కాబోతున్నాయి. ఇంటర్ ప్రథమ సంవత్సరానికి వార్షిక పరీక్షలు కూడా ఉండవు. ఈ పెను మార్పులన్నీ విద్యా విధానాన్ని ఏం చేస్తాయో కానీ మొత్తం మీద ఒక గందరగోళ పరిస్థితి మాత్రం ప్రస్తుతం నెలకొని ఉంది. ఇంటర్మీడియట్ తర్వాత ఇంజినీరింగ్, అగ్రికల్చర్ బిఎస్‌సి, ఫార్మసీ లాంటి కోర్సులు చదవడానికి కూడా ప్రవేశ పరీక్షలు ఉండవు. కేవలం ఇంటర్‌లో మార్కుల ప్రాతిపదికన సీట్ల కేటాయింపు జరుగుతుంది. ఇక భవిష్యత్తులో గురుకులాల సంఖ్య పెరగబోదు. అవి అలాగే కొనసాగితే సంతోషించాల్సిన పరిస్థితి.తెలంగాణ విద్యా కమిషన్ ఆకునూరి మురళి అనే ఒక ఐఎఎస్ అధికారి నేతృత్వంలోని టీం రాష్ట్రంలోని 35 పాఠశాలలు తిరిగి తల్లిదండ్రులతో, విద్యార్థులతో సమావేశాలు జరిపి 54 సెమినార్లు నిర్వహించి ఐదు రాష్ట్రాలు, మూడు విదేశాలు పర్యటించి దాదాపు 18 నెలల కాలంలో ఇచ్చిన నివేదికలో 434 సిఫార్సులు చేసి విద్యావేత్తలను, ఉపాధ్యాయ సంఘాలను, ముఖ్యంగా విద్యాభిమానులను ఆశ్చర్యములోనేకాక ఆగ్రహానికి గురిచేసింది. ప్రభుత్వ విద్యను, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామని, ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలకు మంగళం పాడుతామని ప్రభుత్వం పదేపదే చెప్పడమే కానీ గత రెండున్నర ఏళ్లలో అందుకు చేసిందేమీ లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు లక్షల్లో తగ్గుతుండగా, ప్రైవేటు రంగంలోని బడులలో అవి అదే సంఖ్యలో పెరగడం గమనార్హం. గత పదిహేళ్లుగా ఎన్నో విజయాలు సాధించి ఉచిత, నాణ్యమైన విద్యను అందిస్తూ పివి నరసింహారావు ఆలోచనలకు, ఎన్‌టి రామారావు ఆశయాలకు అనుగుణంగా నడిచి ఐఐటి, మెడిసిన్ సీట్లు గణనీయంగా సాధిస్తూ ఇటు క్రీడారంగంలో కూడా దేశానికి అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించి పెట్టిన గురుకులాలకు నేడు ఆదరణ కరువై కునారిల్లుతున్నాయి.ఆకునూరి కమిటీ నివేదిక విద్యారంగంలో కలకలాన్ని సృష్టించింది. ప్రభుత్వ రంగంలో నేటి వరకు పూర్వ ప్రాథమిక పాఠశాలలు లేవు. పల్లెల్లో అంగన్వాడీలు ఉన్నాయి. అన్ని పాఠశాలలనూ విలీనం చేస్తే పూర్వ ప్రాథమిక నుండి ఇంటర్మీడియట్ వరకు ఒకే క్యాంపస్‌లో నిర్వహించడం అనేక వయసుల వారు అంటే మూడేళ్ల నుండి 17 ఏళ్ల వరకు విద్యార్థులు ఒకే చోట విద్యాభ్యాసం చేయడం సబబేనా? ఆరోగ్యకర వాతావరణం సాధ్యమేనా? కేవలం భవనాలతో రంగులతో, హంగులతో నాణ్యమైన విద్య ఇవ్వగలరా? కార్పొరేట్ వ్యవస్థలో ఇరుకు గదులలో గాలి వెలుతురు లేకుండా క్రీడా మైదానం ఇతర కృత్యాలు లేకుండా ఫలితాలు రావడం లేదా? వాటిని మనం సమర్థించడం లేదు. కానీ నాణ్యత కోసం వేల కోట్ల రూపాయల ఖర్చు కంటే ఒక 1000 కోట్లు కేటాయించి ప్రభుత్వ పాఠశాలలన్నింటినీ బాగు చేయవచ్చు. బలోపేతం చేయడం అంటే విలీనం చేసి ఒకేచోట విద్యాభ్యాసం ఏర్పాటు చేయడమేనా? గురువులకు జీతాలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని తగ్గించాలని, వారికి పదోన్నతులు వద్దని చెప్పడం ఒకరకంగా గురువులకు పంగనామాలు పెట్టడమే. సమాజానికి మార్గదర్శి అయిన గురువు ప్రాధాన్యతను తగ్గించి అవమానించడమే.కాంట్రాక్టు టీచర్లు ఎంత సామర్థ్యం కలిగి ఉన్నా తక్కువ జీతానికి అభద్రతాభావంతో వారు పనిచేయడం కూడా అనుమానాస్పదమే. జాతీయస్థాయిలో అద్భుతాలు సృష్టిస్తున్న ఇంటర్మీడియట్ బోర్డును రద్దుచేసి పాఠశాల విద్యలో విలీనం చేయవలసిన అవసరం లేదు కదా! అంటే నూతన విద్యా విధానాన్ని మన ప్రభుత్వం అనుసరించబోతున్నదా? చిన్ననాటి నుండి ఆంగ్ల మాధ్యమం కూడా అర్థంలేని సిఫారసు. భావ నిర్మాణం మాతృభాషలోనే సాధ్యమని అనేక కమిటీలు విధానాలు ఘోషిస్తున్నాయి. పాఠశాలలో తప్ప మిగిలిన జీవితంలో మనం మాట్లాడేది మాతృభాష మాత్రమే. అంతేకాదు గిరిజన భాషలకు కూడా ముప్పు ఏర్పడవచ్చు. ఆంగ్ల మాధ్యమాన్ని 5 నుండి లేదా 8వ తరగతి నుండి ఐచ్ఛికం చేయవచ్చు. అసలు ఆంగ్ల మాధ్యమంలో బోధించే నైపుణ్యం గల ఉపాధ్యాయులు చాలినంత మంది ఉన్నారా? శిక్షణ ఇచ్చినంత మాత్రాన రోజుల్లోనే నైపుణ్యం వస్తుందా? ప్రతిరోజు విద్యార్థులు ప్రయాణం చేయడం రిస్క్‌తో కూడిన పని. 24 గంటలు క్యాంపస్‌లో ఉంటేనే ఊహించని ప్రమాదాలు జరుగుతున్నాయి.రెండు వేల పాఠశాలల నిర్మాణం ఎన్ని సంవత్సరాలకు జరిగేను? ఒకవేళ ప్రభుత్వాలు మారితే ఈ విధానం ఈ బడులు నిలిచేనా? రూ. 20 వేల కోట్లతో నిర్మించే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఎవరికోసం? ఈ విలీనం విద్యా వికాసానికా లేక విధ్వంసానికా అనేది విద్యావేత్తలు ముఖ్యంగా ఉపాధ్యాయుల సందేహం. గిరిజన బిడ్డల భవితవ్యం ఏమిటి? ఏం కాబోతున్నది? గ్రామీణ నిరుపేదలు చదువుకు మరింత దూరం అవుతారా అనే ఆందోళన ప్రజల్లో ఉంది. విద్యకు 18 శాతం బడ్జెట్ కేటాయింపు చేయాలన్న సిఫార్సు అందరికీ ఆమోదయోగ్యమే కానీ ప్రభుత్వానికి అది ఆచరణ సాధ్యం కాదు. అందుకే 2026- 27 బడ్జెట్లో 8.2% కేటాయించి తన ఉద్దేశాన్ని చాటిచెప్పింది.కమిషన్ ఆలోచనలు ఆకాశంలో ఉండగా ప్రభుత్వ చేతలు పాతాళంలో ఉన్నాయి. విద్యార్థుల ఆశలు, తల్లిదండ్రుల ఆకాంక్షలు ఉపాధ్యాయుల భవిష్యత్తు త్రిశంకు స్వర్గంలో వేలాడుతున్నాయి. రాబోయే రోజుల్లో ఉపాధ్యాయుల కంటే బోధనేతర సిబ్బందికే ఎక్కువ జీతాలు సిఫార్సు చేయడం ద్వారా ఈ కమిషన్ ఉపాధ్యాయుల శ్రమ దోపిడీకి ఎర్రతివాచీ పరిచినట్లుగానే భావించాలి. మానవ వనరుల అభివృద్ధి జరగాలంటే ఉపాధ్యాయులకు సంతృప్తికరమైన వేతనాలు ఉండాలి. అనేక దేశాల్లో ఉపాధ్యాయుల వేతనాలు అత్యధికంగా ఉన్నాయి. కానీ కమిషన్ వాటిని పరిశీలనలోనికి తీసుకోలేదు. తన పరిధి దాటి కమిషన్ వేతనాల గురించి వ్యాఖ్యానించడం అభ్యంతరకరం. ఉపాధ్యాయ శిక్షణలను మరింత పక్కాగా నడిపించాలి అనేది ఒప్పుకోదగిన అంశం. ఇంటర్ తర్వాత వృత్తి విద్యా కోర్సులకు ప్రవేశ పరీక్ష వద్దు అని చెప్పడం ప్రైవేటు రంగానికి మార్గం మరింత సుగమం చేస్తున్నది. ఇంతకాలంగా వృత్తి విద్యా కోర్సులు చదవడానికి పేద విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంతో లబ్ధి పొందుతున్నారు. ఇప్పుడు ఆ పథకాన్ని తీసివేయాలని చెప్పడం పేద విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలు దూరం చేయడమే.డిగ్రీ గురుకులాలను రద్దు చేయాలనడం సంక్షేమ విద్యార్థుల ఉన్నత విద్య ఆశయాలకు అడ్డుకట్ట వేయడమే. ప్రజలకు, వారి నివాసాలకు విద్యాలయాలు అందుబాటులో ఉండాలనే ప్రాథమిక సూత్రాన్ని కమిషన్ ఉల్లంఘించినట్లు స్పష్టం అవుతున్నది. అంటే కమిషన్ సభ్యులు యుజిసి నిబంధనలు అధిగమించి ప్రామాణికంగా ఉన్న కొఠారి కమిషన్ సూత్రాలను పక్కనపెట్టి విద్యా హక్కు చట్టాన్ని పరిగణనలోనికి తీసుకోకుండా నివేదిక తయారు చేశారా అనే ప్రశ్న ఉదయిస్తున్నది. 350 పేజీల నివేదిక ఇన్ని ప్రశ్నలకు అనుమానాలకు తావు ఇచ్చే రీతిలో తయారు చేశారు. దీనివల్ల మరిన్ని సమస్యలు ఉత్పన్నం కాబోతున్నాయి. ఆలోచనల స్థాయిలోనే ఇన్ని సమస్యలు ఉండగా, అమలులో ఇంకెన్ని సమస్యలు రాబోతున్నాయో? ఉపాధ్యాయ సంఘాలను వారి సలహాలను పరిగణనలోనికి తీసుకోకుండా ఈ నివేదిక తయారైందని సంఘాల ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. మొత్తంగా అనేక అనుమానాలకు ఆలవాలమైన ఈ నివేదిక ఉపాధ్యాయులను సంతృప్తి పరచగలదా? తల్లిదండ్రుల ఆకాంక్షలకు, విద్యార్థుల ఆశలకు రూపు ఇవ్వగలదా? కాలమే సమాధానం చెప్పాలి.

## చట్ట విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

సూర్యాపేట, : చట్ట విరుద్ధంగా ప్రవేట్ ఆసుపత్రులు గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, సూర్యాపేటలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రులు తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ రెగ్యులేషన్ యాక్ట్ నిబంధనల రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. అర్హతలు వున్నవాటికి సకాలంలో అనుమతులు మంజూరు చేయాలని, గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు నిర్వహించినచో వాటిని మూసి వేయాలన్నారు. ఈ నిబంధనలను ఉల్లంఘించే ఆసుపత్రులపై, వాటి ప్రాంగణాలను సీల్ చేయడంతో సహా కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. నవీకరించబడిన రికార్డులు, వైద్య బృందాలచే క్రమమైన తనిఖీలు, అమలు కోసం పోలీసుల సమన్వయంతో నిర్వహించాలన్నారు. తనిఖీ చేసిన 10 రోజుల్లోగా నిబంధనలను పాటించని ఆసుపత్రులను సీల్ చేయడానికి చర్యలు తీసుకోవాలి అన్నారు. పిసిపిఎన్ డిటి చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. తదుపరి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా,,పెండెం వెంకట రమణ మాట్లాడుతూ జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ నుండి 23 ప్రొవిజినల్, 28 పర్మినెంట్ అనుమతులు ఇచ్చామని, 31 ఎస్టాబ్లిష్మెంట్స్ తిరస్కరించమని, అర్హతలేని వైద్యుల స్కానింగ్ సెంటర్ మూసివేశామని తెలిపారు. ఈ కారక్రమశీలో అడిషనల్ ఎస్పీ రవీందర్ రెడ్డి, జిజి హెచ్ సూపరింటెండెంట్ శ్రావణ్ కుమార్, డా,, ప్రవీణ్ కుమార్, డా,, వెంకటేశ్వర్లు, ఐఎంఏ ప్రెసిడెంట్ డా,,ఆనంద్, డి డబ్ల్యు ఓ నర్సింహా రావు, డీఈఓ అశోక్, డిప్యూటీ డిఎంహెచ్వో డా,, చంద్ర శేఖర్, డా,,మాధవ్ కుమార్, ప్రోగ్రాం అధికారులు డా,, కోటి రత్నం, డా,, ప్రసిద్ధ్, డా,, నాజియా, డా,, శ్రీశైలం, డిప్యూటీ డి ఇ ఎం సంజీవ్ రెడ్డి, ఉపేందర్, కల్యాణ్ పాల్గొన్నారు.

## ఆరోగ్యమే మహాభాగ్యం

ఇబ్రహీంపట్నం, : ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న ఆరోగ్య అవగాహన వారోత్సవాల సందర్భంగా, ఎలిమినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 'సురక్షిత మాతృత్వ దినోత్సవం' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు సరైన పోషకాహారం తీసుకుంటూ, ఆశా వర్కర్ల సహకారంతో ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య సేవలు పొందాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం 57% ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రులలోనే జరుగుతున్నాయి. మాతా శిశు మరణాలను తగ్గించి, సాధారణ ప్రసవాలను మరింత ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు 9 నుండి 14 ఏళ్ల బాలికలకు ఈ వ్యాక్సిన్ ఎంతో మేలు చేస్తుందని, జిల్లాలోని 22 కేంద్రాల్లో ఇది ఉచితంగా అందుబాటులో ఉందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుతున్న డ్రగ్స్ సంస్కృతిపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలకు సూచించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ లలితా దేవి మాట్లాడుతూ.. జిల్లాలో మాతృ మరణాల సంఖ్య గణనీయంగా తగ్గిందని, ప్రసవానంతర సేవలను పటిష్టంగా అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎరువులపై సబ్సిడీ రూ.41,534 కోట్లకు పెంపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: రైతులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావంతో అంతర్జాతీయంగా ఎరువుల ధరలు పెరుగుతోన్న వేళ.. 2026 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఎరువులపై సబ్సిడీని భారీగా పెంచింది. పాస్ఫేటిక్, పొటాసిక్(పీ,కే) ఎరువులపై సబ్సిడీ మొత్తాన్ని రూ.41,534 కోట్లకు పెంచింది. 2025 ఖరీఫ్ సీజన్‌లో ఈ సబ్సిడీ రూ.37,216 కోట్లుగా ఉంది. ప్రధాని మోదీ నేతృత్వంలో సమావేశమైన కేంద్ర మంత్రిమండలి ఈ సబ్సిడీ పెంపునకు ఆమోదం తెలిపింది. 2026 ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు పెరిగిన సబ్సిడీ అమలులో ఉంటుంది. 2025-26 రబీ సీజన్‌లో నత్రజని(నైట్రోజన్)పై కిలోకు రూ.43.02 చొప్పున సబ్సిడీ ఇచ్చిన కేంద్రం 2026 ఖరీఫ్ సీజన్‌లో దానిని రూ.47.32కు పెంచింది. ఫాస్ఫేట్ సబ్సిడీని కిలోకు రూ.47.96 నుంచి రూ.52.76కు, సల్ఫర్‌పై సబ్సిడీని కిలోకు రూ.2.87 నుంచి రూ.3.16కు పెంచింది. పొట్టా?షపై కిలోకు రూ.2.38 చొప్పున ఇస్తోన్న రాయితీలో మాత్రం మార్పు చేయలేదు.

## అమెరికా, భారత్ సంబంధాల బలోపేతం



న్యూఢిల్లీ: భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ అమెరికా పర్యటనలో భాగంగా కీలక దౌత్య చర్చలు జరిపారు. మూడు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా వాషింగ్టన్‌లో అమెరికా రక్షణ, వాణిజ్య శాఖల ఉన్నతాధికారులతో సమావేశమై ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై దృష్టి సారించారు. ముఖ్యంగా రక్షణ పరిశ్రమ, ఆధునిక సాంకేతికత, సరఫరా గొలుసుల అనుసంధానంపై విస్తృతంగా చర్చలు జరిగాయి. పెంటగాన్‌లో అమెరికా రక్షణ శాఖకు చెందిన అండర్ సెక్రటరీ మైఖేల్ డఫీతో విక్రమ్ మిస్రీ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరుదేశాల మధ్య రక్షణ రంగంలో ఉన్న భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. గత ఏడాది కుదిరిన మేజర్ డిఫెన్స్ పార్టనర్‌షిప్ ఫ్రేమ్‌వర్క్‌కు అనుగుణంగా రక్షణ రంగంలో సహకారాన్ని పెంచేందుకు మార్గాలను అన్వేషించారు. భారత రాయబార కార్యాలయం తెలిపిన వివరాల ప్రకారం, ఈ సమావేశం ఎంతో ఫలప్రదంగా సాగింది. రక్షణ ఉత్పత్తి, సాంకేతిక మార్పిడి, సరఫరా గొలుసుల బలోపేతంపై ఇరుపక్షాలు తమ అభిప్రాయాలను పంచుకున్నాయి. భవిష్యత్తులో రక్షణ రంగంలో సంయుక్త ప్రాజెక్టులు, పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలని కూడా చర్చించారు. ఇదే పర్యటనలో భాగంగా విక్రమ్ మిస్రీ అమెరికా వాణిజ్య శాఖకు చెందిన అండర్ సెక్రటరీలు జెఫ్రీ కెస్లర్, విలియం కిమ్మిట్‌లతో కూడా సమావేశమయ్యారు. ఈ భేటీలో ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాల విస్తరణపై ప్రధానంగా చర్చించారు. ముఖ్యంగా కీలక సాంకేతిక రంగాలు, వాణిజ్య సహకారం, మరియు విశ్వసనీయ సరఫరా గొలుసుల నిర్మాణంపై ఇరుదేశాలు దృష్టి పెట్టాయి. 21వ శతాబ్దానికి అనుగుణంగా భారత్- అమెరికా భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని ఇరుపక్షాలు అభిప్రాయపడ్డాయి. ముఖ్యంగా సెమీకండక్టర్లు, ఆధునిక తయారీ, డిజిటల్ టెక్నాలజీ వంటి రంగాల్లో సహకారం పెంచాలని నిర్ణయించారు. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా, విశ్వసనీయ మరియు స్థిరమైన సరఫరా గొలుసులు ఎంత ముఖ్యమో ఈ సమావేశాల్లో ప్రస్తావనకు వచ్చింది. విక్రమ్ మిస్రీ పర్యటనలో గ్లోబల్ అంశాలు కూడా ప్రాధాన్యం పొందాయి. ముఖ్యంగా పశ్చిమాసియా ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, అంతర్జాతీయ భద్రతా పరిస్థితులపై ఇరుదేశాలు తమ అభిప్రాయాలను పంచుకున్నాయి. ఈ అంశాల్లో సమన్వయం పెంచుకోవాలని కూడా నిర్ణయించారు. ఇటీవలి కాలంలో భారత్-అమెరికా సంబంధాలు కొంత ఒడిదుడుకులకు గురైన విషయం తెలిసిందే. అమెరికా విధించిన సుంకాలు, అలాగే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలకు దారితీశాయి. ముఖ్యంగా భారత్-పాకిస్తాన్ ఉద్రిక్తతల సమయంలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. ఈ నేపథ్యంలో విక్రమ్ మిస్రీ పర్యటనకు ప్రాధాన్యం పెరిగింది. ఇరుదేశాల మధ్య సంబంధాలను మళ్లీ స్థిరీకరించడం, పరస్పర నమ్మకాన్ని పెంపొందించడం ఈ పర్యటన లక్ష్యంగా కనిపిస్తోంది.

## ఏసీబీకి చిక్కిన ప్రభుత్వ ఉద్యోగులు



గూడూరు:లంచం తీసుకుంటూ ప్రభుత్వ అధికారులు ఏసీబీకి చిక్కిన ఘటనలు మహబూబాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో చోటుచేసుకున్నాయి. ఏసీబీ డీఎస్పీ ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒక వ్యక్తి నకిలీ సర్టిఫికెట్లతో నకిలీ పాస్‌పోర్టు తయారుచేసి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చాడు. పరిశీలించిన అధికారులు ఫేక్ పాస్‌పోర్టు ఉండటంతో అతన్ని అరెస్టు చేసి రిమాండ్ చేశారు. అనంతరం అతడు బెయిల్‌పై వచ్చాడు. ప్రతి ఆదివారం క్రమం తప్పకుండా అవుట్ పోస్ట్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి సంతకాలు చేసి వెళ్లాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఔట్ పోస్ట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సంపత్తి కనకయ్య, ఎస్ఐ సిద్దేశ్వర్ అతన్ని వేధించారు. ఈ కేసులో చార్జిషీట్ వేయాలంటే రూ.15 లక్షలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే అతని కుటుంబ సభ్యులను సైతం బాధ్యులను చేస్తామని బెదిరించారు. అయితే బాధితుడు అతని వద్ద అంత డబ్బులు లేవని చెప్పడంతో రూ. 5లక్షలు ఇవ్వాలని ఒత్తిడిచేశారు. దాంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈ క్రమంలో రూ.2లక్షలు తీసుకొని పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. బాధితుని నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి డబ్బులు స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు ఎంఈఓ జె.రవికుమార్, మరో ఉపాధ్యాయుడు చంద్రమౌళి రిటైర్మెంట్ బెనిఫిట్ పత్రాలు ఇచ్చే క్రమంలో రూ.15వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. మండలంలోని అయోధ్యపురం స్కూల్ కాంప్లెక్స్ పరిధి గుండెంగ గ్రామం భాగ్యతండాకు చెందిన ఉపాధ్యాయుడు దయ్యాల రవీందర్ ఈ నెల రిటైర్మెంట్ ఉంది. రిటైర్మెంట్ బెనిఫిట్ పత్రాల కోసం ఎంఈఓ రవికుమార్‌ను సంప్రదించగా రెండు నెలలుగా తిప్పించుకున్నాడు. ఈ క్రమంలో రూ.50వేలు లంచం ఇవ్వాలని రవీందర్‌ను డిమాండ్ చేయగా ఏసీబీని ఆశ్రయించాడు. కాగా, బుధవారం రవీందర్, చంద్రమౌళికి రూ.15000 ఇస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారిని అరెస్ట్ చేసి వరంగల్ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నట్టు డీఎస్పీ సాంబయ్య తెలిపారు.

## హైడ్రా మరో భారీ ఆపరేషన్..



హైడ్రాబాద్:రిహైదరాబాద్ నగరంలో నాలాలు, చెరువులు, పార్కులు సహా ప్రభుత్వ భూములను కబ్జాకోరల నుంచి విడిపించేందుకు హైడ్రా అధికారులు వరుసగా ఆపరేషన్లు చేపడుతూనే ఉన్నారు. ఆక్రమణల్లో ఏర్పాటు చేసిన గుడిసెల నుంచి మొదలుకుని భారీ నిర్మాణాలను కూడా బుల్డోజర్లతో కూల్చేస్తున్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించిన కబ్జాదారుల భరతం పడుతున్న హైడ్రా అధికారులు.. ఆక్రమణలు చేయాలంటేనే భయపడేలా చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో తాజాగా హైడ్రా అధికారులు భారీ ఆపరేషన్ చేపట్టి.. 8 ఎకరాలకు పైగా భూమిని ఆక్రమణల చెర నుంచి కాపాడారు. ఈ స్థలం విలువ బహిరంగ మార్కెట్‌లో ఏకంగా రూ.1200 కోట్ల విలువ ఉంటుందని తెలిపారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలోని ఖానామెట్ గ్రామంలో ఉన్న భూమిని హైడ్రా అధికారులు కాపాడారు. సర్వే నంబర్ 55లో ఉన్న 8 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిని మంగళవారం భారీ ఆపరేషన్ చేపట్టి.. హైడ్రా స్వాధీనం చేసుకుంది. ఐటీ హబ్‌కి అతి దగ్గరలో ఉన్న ఈ భూమిని.. కొందరు బడా రియల్ ఎస్టేట్ సంస్థలు ఆక్రమించుకున్నట్లు గుర్తించారు. పలు నిర్మాణ సంస్థలు ఆక్రమించిన 4.20 ఎకరాల ప్రభుత్వ భూమితో పాటు.. కొలను మాధవరెడ్డి కుమార్తె సబితకు చెందిన 4 ఎకరాల భూమిని కూడా హైడ్రా అధికారులు తిరిగి స్వాధీనం చేసుకున్నారు. ఇక ఈ స్థలాల్లో తాత్కాలికంగా వేసిన షెడ్లను హైడ్రా అధికారులు బుల్డోజర్లతో తొలగించారు. అదే సమయంలో ప్రభుత్వానికి చెందిన స్థలంలో ఏర్పాటు చేసిన ఆర్‌సీసీ ప్లాంట్‌ను.. వాసవి నిర్మాణ సంస్థ స్వయంగా తీసేసింది. అంతేకాకుండా తమ సంస్థ నిర్మాణ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్లను కూడా హైడ్రా అధికారులు తొలగించారు. ఆ ఆపరేషన్‌లో భాగంగా మొత్తం 8.20 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఉన్న ఆక్రమణలను తొలగించి బోర్డులు ఏర్పాటు చేసినట్లు హైడ్రా అధికారులు వెల్లడించారు. ఒక్క మంగళవారం రోజున హైడ్రా రక్షించిన భూముల మార్కెట్ విలువ రూ. 1200ల కోట్లకు పైగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. గతంలో కూడా అదే ప్రాంతంలో ఉన్న ఆక్రమణలను హైడ్రా అధికారులు తొలగించారు. సర్వే నంబరు 53లోని మొండికుంట ఆక్రమణలు.. సర్వే నంబరు 55లోని 11 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా హైడ్రా స్వాధీనం చేసుకుంది. మరోవైపు.. ఖానామెట్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 55లో ఉన్న భూమి అసైన్డ్ ల్యాండ్ అని.. అది నిషేధిత జాబితాలో ఇప్పటికే రంగారెడ్డి కలెక్టర్ ఉంచారు. కానీ ఆ భూమి తమదే అని మీనాక్షి రియల్ ఎస్టేట్ సంస్థ క్లెయిమ్ చేస్తోంది. అందులో వాసవి నిర్మాణ సంస్థ ఆర్‌సీసీ ప్లాంటు ఏర్పాటు చేయడంతో పాటు.. కార్మికులకు షెడ్లను కూడా నిర్మించింది. ఈ క్రమంలోనే 4.20 ఎకరాల భూమిని పెద్ద పెద్ద రియల్ ఎస్టేట్ కంపెనీలు తమ ఆక్రమణలో ఉంచుకున్నాయి. వీటికి తోడు ఇదే సర్వే నంబరులో ఉన్న మరో 4 ఎకరాల భూమిని కొలను సబిత తనదే అంటూ పేర్కొంటున్నారు. ఆ భూములకు కాపలాగా బౌన్సర్లను కూడా ఏర్పాటు చేయడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఆ భూములపై ఫిర్యాదు అందడంతో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలతో క్షేత్ర స్థాయిలో ఆయా శాఖల అధికారులతో కలిసి విచారణ జరిపి.. అది ప్రభుత్వ భూమే అని తేల్చి స్వాధీనం చేసుకున్నారు.

# రెండు నెలల్లో ప్రాజెక్టు పనులు పూర్తి

రుద్రంగి, : రెండు నెలల్లో కలికోట సూరమ్మ చెరువు ప్రాజెక్ట్ పనులను పూర్తిచేయా లని అధికారులు, కాంట్రాక్టర్‌ను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఇరిగేషన్ అధికారులతో కలికోట సూరమ్మ ప్రా జెక్టు పనులు పరిశీలించి సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల వేగాన్ని పెంచాలని అధికారులు, కాంట్రాక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. వచ్చే వర్షాకాలం ప్రారం భానికి ముందే ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తిచేయాలని అన్నారు. రాత్రి సమయంలో కూడా పనులు జరిగే విధం గా చర్యలు చేపట్టాలన్నారు. వేములవాడ నియోజకవర్గ పరిధిలోని మేడిపల్లి, భీమారం, కథలాపూర్ మండలాల రైతులకు సాగు, తాగునీటి అవసరాలను తీర్చే కీలక ప్రాజెక్టు అయిన కలికోట సూరమ్మ చెరువు అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయన్నారు. పనుల అమలు పర్యవేక్షణకు ప్రతి 11 రోజులకు ఒకసారి సమీక్ష సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమా వేశాల్లో పనుల పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై చర్చించి వేగవంతమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించా రు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే సుమారు 40 వేల ఎకరాలకు సాగునీరు అందనున్నట్లు అధికారు లు తెలిపారు. దీంతో ప్రాంతీయ రైతులకు భారీగా లాభం చేకూరనుంది. ఇప్పటికే ప్రాజె క్ట్‌కు సంబంధించిన కుడి, ఎడమ కాలువల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ పూర్త యిందని, త్వరలోనే కాలువల నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ సంతూ ప్రకాష్, మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, రుద్రంగి సర్పంచ్ గండి నారాయణ, ఉప సర్పంచ్ మాడిశెట్టి అభిలాష్, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, ఆకుల గగన్, పూదరి మహిపాల్, ఎర్రం అరవింద్, తర్రె లింగం, దయ్యాల శ్రీనివాస్, దసారి గంగారాజం తదిత రులు పాల్గొన్నారు.

## 150ఎకరాల్లో ఆయిల్‌పామ్ నాటడమే లక్ష్యం

పాలకుర్తి, : వచ్చే ఖరీఫ్ నాటికి గ్రామంలో అదనంగా 150ఎకరాల్లో ఆయిల్ పామ్ నాటడమే లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ కోయశ్రీహర్ష అన్నారు. మండలం పరిధి లోని ఈసాలతక్కళ్లపల్లి గ్రామంలో నిర్వహించిన ఆయిల్‌పామ్‌సాగుపై నిర్వహించిన సమీక్ష సమావే శంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వప్రోత్సహకాలను వినియోగిం చుకొని రైతులు ఆయిల్‌పామ్ సాగును విస్తరించా లని సూచించారు. గ్రామంలో సుమారు 150ఎక రాల్లో ఆయిల్‌పామ్ సాగుకు రైతులు సిద్ధంగా ఉన్న ప్పటికీ, రెండుసంవత్సరాలుగా వివిధ కార ణాల వల్ల నాటలేదని తెలిపారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో ఈ 150 ఎకరాల్లో తప్పనిసరిగా కొత్తగాఆయిల్‌పామ్ నాటేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయిల్‌పామ్ పంటకు ఎకరాకు నాలుగు సంవత్సరాలపాటు సుమారు రూ.52 వేల విలువైన సబ్సిడీ ప్రభుత్వం అందిస్తున్నదని తెలిపారు. ఈ సందర్భంగా ఆయిల్‌పామ్ పంటకు మొదటి విడతగా లబ్ధిపొందిన రైతులు స్వప్న, చంద్రయ్యకు రూ.43వేల విలువైన చెక్కులను కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ అధికారి జగన్మోహన్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడి శ్రావణ్‌కుమార్, జిల్లా భూగర్భ నీటిశాఖ అధికారి లావణ్య, తిరుమల ఆయిల్ పామ్ కంపెనీ సీఈవో కేషు కళ్యాణ్, అల్ల?ట్రటెక్ ప్లాంటేషన్ ఆఫీసర్ భరత్, రామగుండం ఉద్యానవనశాఖ అధికారి ఏ జ్యోతి, మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్, వ్యవసాయవిస్తరణ అధికారి ఎం యోజన, బి రాము, టి ప్రశాంత్, రాజు, గ్రామ సర్పంచ్ బండి శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ ఓడ్నాల జ్యోతి, రైతులు పాల్గొన్నారు.

### కేసీఆర్ హయాంలో కాంట్రాక్టర్ల జేబులు నింపడానికే

# ప్రాజెక్టులు కట్టారు: మహేశ్ కుమార్ గౌడ్



మహబూబ్‌నగర్,: కేసీఆర్ ప్రభుత్వంలోని పదేళ్ల హయాంలో కాంట్రాక్టర్ల జేబులు నింపడం కోసం ప్రాజెక్టులు కట్టారని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. మహబూబ్ నగర్‌లో కాంగ్రెస్ 'సంఘటన్ శ్రీజన్ అభియాన్' సమావేశం ఘనంగా నిర్వహించారు. మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'సంఘటన్ శ్రీజన్ అభియాన్' కార్యక్రమం భాగంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యవర్గ ప్రమాణ స్వీకారం సమావేశం ఘనంగా జరిగింది. జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి మహేశ్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం మహేశ్ కుమార్ గౌడ్ డీసీసీ కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్, సీడబ్ల్యూసీ సభ్యులు చల్లా వంశీ చందర్ రెడ్డి , టీపీసీసీ జనరల్ సెక్రటరీలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్ట్ పూర్తి అయితే లక్షల ఎకరాలకు సాగునీరు అందించి రైతుల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మహబూబ్ నగర్ జిల్లాను సస్యశ్యామలం చేయడమే కాంగ్రెస్ సంకల్పమని చెప్పుకొచ్చారు. బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇవ్వకుండా నిర్లక్ష్యం చూపుతోందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా వస్తుందని తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ ఆర్థిక విధ్వసాన్ని ఎత్తి చూపి తీరాల్సిందేనని అన్నారు. బీఆర్ఎస్‌కి తెలంగాణ అభివృద్ధిపై ఓ విజన్ లేకపోవడంతో నష్టపోయిందని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. సుదీర్ఘ చరిత్ర కలిగిన పార్టీ కాంగ్రెస్ అని ఉద్ఘాటించారు. మహత్యాగాలు చేసిన కుటుంబం గాంధీ కుటుంబమని చెప్పుకొచ్చారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 12 ఏళ్ల కాలంలో అధికారం పరమావధిగా కుల, మతాల మధ్య చిచ్చు పెడుతూ విచ్చిన్నం చేసే కుట్రలు చేస్తున్నారని ఆగ్రహించారు. బీజేపీ హయాంలో పెట్రోల్, డీజిల్ రెట్లు తగ్గాయా? అని ప్రశ్నించారు. 2 కోట్ల ఉద్యోగాలు వచ్చాయా? అని నిలదీశారు. శ్రీరాముడి పేరు చెప్పి ఓట్లు అడగటం బీజేపీ నేతల నైజమని విమర్శించారు. పిల్లల భవిష్యత్ కోసం కాంగ్రెస్ పార్టీ కావాలని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. రాజకీయం చైతన్యం కలిగిన జిల్లా మహబూబ్ నగర్ అని చెప్పారు. ప్రతి ఒక్క కార్యకర్త కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమన్ని ప్రజలకు వివరించే ప్రయత్నం చేయాలని సూచించారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు నిత్యం అసత్యాలు, అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కష్టపడితే ఫలితం వస్తుందని అనడానికి తాను టీపీసీసీ అధ్యక్షుడు కావడం ఓ ఉదాహరణ అని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి లక్ష 20 వేల కోట్లు గోదావరిలో పోశారని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం కూళేశ్వరం అయ్యిందని విమర్శించారు. ఫీడ్ లైవ్‌లో వచ్చిందని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# గొడవ పడ్డ హీరోకు తండ్రి స్థానమిచ్చిన దర్శకుడు



ఒకప్పుడు మంచి స్నేహితులుగా ఉన్న తమిళ స్టార్ హీరో ధనుష్, అగ్ర కథానాయిక నయనతార.. కొన్ని కారణాల వల్ల శత్రువులుగా మారిపోయిన సంగతి తెలిసిందే. నయన్ గతంలో ధనుష్ సరసన యారడీ నీ మోహిని చిత్రంలో కథానాయికగా నటించింది. తర్వాత ధనుష్ ప్రొడ్యూస్ చేసిన ఒక సినిమాలో ఆమె ఉచితంగా ఐటెం సాంగ్ కూడా చేసింది. ఇక నయనతారతో పెళ్లి కావడానికి ముందు విఘ్నేష్ శివన్‌కు వీఐపీ సినిమాలో అసిస్టెంట్‌గా అవకాశం ఇవ్వడమే కాక.. అతణ్ని దర్శకుడిగా పరిచయం చేస్తూ విజయ్ సేతుపతి–నయనతారలతో నానుమ్ రౌడీదా సినిమాను ప్రొడ్యూస్ చేసింది కూడా ధనుషే. అలాంటిది కొన్నేళ్ల ముందు నయన్, విఘ్నేష్ తమ పెళ్లి వీడియోలో నానుమ్ రౌడీదా చిత్రానికి సంబంధించి కొన్ని సెకన్ల ఫుటేజీ వాడుకుంటే వాళ్లకు లీగల్ నోటీసులు ఇచ్చాడు ధనుష్. అంతగా విఘ్నేష్, నయన్‌లతో ధనుష్‌కు దూరం పెరిగింది. దీని వెనుక కారణాల గురించి రకరకాల ప్రచారాలు ఉన్నాయి. ఐతే నయన్ సగతెలా ఉన్నప్పటికీ, తనకు లైఫ్ ఇచ్చిన ధనుష్ విషయంలో విఘ్నేష్ కృతజ్ఞతతో వ్యవహరించలేదనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో తన కొత్త చిత్రం లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ధనుష్ గురించి విఘ్నేష్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ధనుష్ పెద్ద వయస్కుడు కానప్పటికీ.. తాను అతడికి తండ్రి స్థానం ఇస్తానన్నాడు విఘ్నేష్. తన తండ్రి మరణించిన రోజే.. ధనుష్ బర్త్ డే అని.. అతణ్ని తన తండ్రిగానే భావిస్తానని విఘ్నేష్ చెప్పాడు. ప్రస్తుతం తాను ఈ స్థాయిలో ఉన్నాను, ఇంత మంచి జీవితం గడుపుతున్నాను అంటే అందుకు ముఖ్య కారణం ధనుషే అని స్పష్టం చేశాడు విఘ్నేష్. వీఐపీ షూటింగ్ టైంలో రెండేళ్ల పాటు ధనుష్‌తోనే ఉన్నానని.. ఆ టైంలో ఆయన తిన్నాకే తాను భోంచేసేవాడినని విఘ్నేష్ గుర్తు చేసుకున్నాడు. తమ మధ్య ఒకప్పుడు గొప్ప అనుబంధం ఉండేదని.. ఇప్పుడది లేదని.. అందుకు సిగ్గుపడుతున్నానని విఘ్నేష్ వ్యాఖ్యానించాడు. కూర్చుని మాట్లాడుకుంటే అన్నీ సర్దుకుంటాయని.. కానీ తమ మధ్య అలాంటి పరిస్థితి లేకుండా పోయిందని.. ఇలా ఎందుకు జరిగిందో తెలియడం లేదని విఘ్నేష్ అన్నాడు. మరోవైపు దర్శకుడిగా తన తొలి చిత్రం పోడాపోడీని విజయ్ మూవీ తుపాకికి పోటీగా రిలీజ్ చేయడం పెద్ద మైనస్ అని.. ఆ సినిమా ఇంటర్వెల్లో విజయ్ 12 మందిని షూట్ చేస్తాడని.. కానీ సినిమాలో కనిపించని 13వ వ్యక్తిని తనే అని.. విజయ్ దెబ్బకు తన పనైపోయిందని అన్నాడు విఘ్నేష్.

# అంగన్‌వాడీ కేంద్రాల సేవలను విస్తృతపరచాలి



మిర్యాలగూడ, : సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ఐసిడిఎస్ ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్ వాడీ కేంద్రాల సేవలను లబ్ధిదారులకు మెరుగైన, నాణ్యమైన, పారదర్శకమైన సేవలందించేందుకు విస్తృతపరచాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి(బిఎల్అర్ ) అన్నారు. మిర్యాలగూడ అర్బన్ సిడిపిఓ రేఖల మమత ఆధ్వర్యంలో ప్రాజెక్టు పరిధిలోని 194 మంది అంగన్ వాడీ టీచర్లకు ఎన్ హెచ్ టి ఎస్, పోషణ ట్రాకర్ యాప్ లను పొందుపర్చేందుకు సెల్ ఫోన్ లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యను పేదలకు అందజేసేందుకు, మాతా శిశు మరణాలను తగ్గించేందుకు చేస్తున్న ప్రయత్నాలలో భాగంగా నూతన సాంకేతికతో అంగన్ వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకందిస్తున్న సేవలను సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు సంబంధించిన ప్రతి డాటా ను ఈ యాప్ లో పొందుపరచాలన్నారు. అనంతరం 251 అంగన్ వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఏకరూప దుస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు రాధిక, నాగమణి, నజీమా బేగం మహమ్మద్, వాణి, హేమాదేవి, పద్మ, నిహారికలతో పాటు అంగన్ వాడీ టీచర్లు పాల్గొన్నారు.

### ఎస్టీ సర్టిఫికెట్ జారీలో

# సరళమైన విధానాన్ని అమలు చేయాలి



హైదరాబాద్:గిరిజన యువతను ప్రభావితం చేస్తున్న కుల ధ్రువీకరణ సమస్యలపై హైకోర్టు అడ్వకేట్ జనరల్‌తో సంప్రదించి శాశ్వత పరిష్కారం తీసుకురావాలని అధికారులను రాష్ట్ర ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశించారు. ఇకపై ధ్రువీకరణలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా సరళమైన విధానాన్ని అమలు చేయాలని సూచించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో గిరిజన ప్రాంతాల్లో ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో కలిసి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. వివిధ జిల్లాల కలెక్టర్లు, ఐటీడీఏ పీవోలు, అటవీ శాఖ అధికారులు, గిరిజన ప్రాంతాల ప్రజా ప్రతినిధులతో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాస్థాయిలో కలెక్టర్లు, ఐటీడీఏ అధికారులు, అటవీ, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పని చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి జిల్లాలో ప్రత్యేక సమీక్షలు నిర్వహించి సమస్యలను స్థానికంగానే పరిష్కరించే విధానాన్ని అమలు చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఇసుక రవాణా సమస్యలు గిరిజనులకు అడ్డంకి కాకూడదని మంత్రి స్పష్టం చేశారు. అవసరమైన చోట ప్రత్యేక అనుమతులు ఇచ్చి నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సూచించారు. అలాగే తాగునీటి సమస్య నివారణకు కొత్త బోర్లు తవ్వడం, పాత వనరులను పునరుద్ధరించడం చేపట్టాలన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయాలని మంత్రి నిర్ణయించారు. గిరిజన గ్రామాలను స్వయంగా సందర్శించి వాస్తవ పరిస్థితులను తెలుసుకుంటానని తెలిపారు. ఈ నెలాఖరులోగా గిరిజన ప్రాంతాల్లో ముఖ్య సమస్యల పరిష్కారం దిశగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి అమలు ప్రారంభించాలని మంత్రి గడువు విధించారు. ఒక ప్రాంత సమస్యను రాష్ట్రవ్యాప్తంగా వర్తింపజేయకుండా, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. గిరిజన ప్రాంత సమస్యల పరిష్కారంలో అధికారులు మానవతా దృక్పథంతో పనిచేయాలని, మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయాలని సూచించారు. పేద గిరిజనులు నివసించే ప్రతి ప్రాంతానికి చేరుకునే త్రోవ (రోడ్డు), నివసించేందుకు గూడు (ఇల్లు), అడవుల్లో చీకట్లు తొలగించే విద్యుత్ సౌకర్యం( కరెంటు), తాగునీటి కోసం బోర్లు వంటి ప్రాథమిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. గిరిజన, ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వం మౌలిక వసతుల కోసం నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ, అమలు దశలో ఎదురవుతున్న అడ్డంకులపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల జీవన ప్రమాణాలను మెరుగుపర్చాలంటే శాఖల మధ్య సమన్వయం అత్యవసరమని స్పష్టం చేశారు. నిధులు ఉన్నా పనులు జరగకపోవడం సహించబోమని హెచ్చరించారు. అటవీ భూములు, పోడు సాగు, ఫారెస్ట్ రైట్స్ చట్టం కింద హక్కుల పత్రాల జారీ విషయంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను అటవీ, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు. అవసరమైతే ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసి వేగంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అటవీ చట్టం ప్రకారం వారికి ఎక్కడ వీలైతే అక్కడ వ్యవసాయం చేసుకునేలా సాగు భూమిని అందుబాటులో ఉండేలా చూడాలని మంత్రి అటవీశాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి సబ్యసాచి ఘోష్, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సువర్ణ , ఎమ్మెల్యేలు బాలు నాయక్, రామచంద్ర నాయక్, డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, మురళి నాయక్, కోవ లక్ష్మి, అనిల్ కుమార్ యాదవ్‌తో పాటు ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల కలెక్టర్లు, ఐటీడీఏ అధికారులు, డిఎఫ్‌ఓలు ఇతర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

# సంతోష్ శోభన్... పరలోక యాత్ర



ఫ్లాపుల పరంపరకు తెరదించుతూ.. ఈ ఏడాది కపుల్ ఫ్రెండ్లీ చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్నాడు యువ కథానాయకుడు సంతోష్ శోభన్. కెరీర్లో ఎక్కువగా కామెడీ సినిమాలు ట్రై చేసిన అతను.. కపుల్ ఫ్రెండ్లీ లాంటి ఎమోషనల్ లవ్ స్టోరీతో సక్సెస్ సాధించడం ఆశ్చర్యం కలిగించే విషయమే. కానీ ఇందులో కూడా అక్కడక్కడా తన కామెడీ టైమింగ్ చూపించాడు సంతోష్. ఈ హిట్ తర్వాత ఆత్మవిశ్వాసం పుంజుకున్న అతను.. తన స్టయిల్లో కామెడీ సినిమాకు రెడీ అవుతున్నాడు. సంతోష్ కొత్త సినిమా టైటిల్ చూస్తేనే నవ్వు రావడం ఖాయం. సత్తిబాబు పరలోక యాత్ర.. ఇదీ సంతోష్ కొత్త సినిమా టైటిల్. కొన్నేళ్ల ముందు బెల్లంకొండ గణేష్ హీరోగా స్వాతిముత్యం అనే మంచి ఫన్ మూవీ తీసిన లక్ష్మణ్ కృష్ణ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నాడు. సంతోష్ శోభన్‌కు ఆస్థాన నిర్మాణ సంస్థలా మారిన యువి క్రియేషన్సే ఈ చిత్రాన్ని కూడా ప్రొడ్యూస్ చేయబోతోంది. ఏఆర్ ఫిలిమ్స్ కూడా ఈ చిత్రంలో భాగస్వామిగా ఉండనుంది. సంతోష్‌కు కెరీర్లో తొలి విజయాన్నందించింది యువి క్రియేషన్సే. ఆ సంస్థలో తెరకెక్కి నేరుగా ఓటీటీలో రిలీజైన ఏక్ మిని కథ మంచి ఫలితాన్నందుకుంది. ఆ తర్వాత అతను చాలా సినిమాలు ట్రై చేశాడు కానీ.. అవేవీ ఫలితాన్నివ్వలేదు. ఎట్టకేలకు కపుల్ ఫ్రెండ్లీతో అతను సక్సెస్ ట్రాక్ ఎక్కాడు. స్వాతిముత్యంలో కొత్త పాయింట్ మీద చాలా సరదాగా సినిమాను నడిపించి ప్రశంసలు అందుకున్నాడు లక్ష్మణ్. ఐతే ఆ సినిమా కమర్షియల్‌గా అనుకున్నంత విజయం సాధించలేదు. ఈసారి సంతోష్ లాంటి మంచి కామెడీ టైమింగ్ ఉన్న హీరోతో అతను వినోదాత్మక చిత్రం చేయబోతున్నాడు. మేకర్స్ కూడా ఇదొక హిలేరియస్ మూవీ అని అనౌన్స్‌మెంట్‌లోనే చెబుతున్నారు. మరి సంతోష్, లక్ష్మణ్ కలిసి ఎంతమేర నవ్విస్తారో చూడాలి.

